క్లుప్తంగా

దోమతెరలు పంపిణీ



దోమతెరలు అందజేస్తున్న కల్పనా చౌదరి

జూలూరుపాడు: వీరభద్రాపురం గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజన కుటుంబాలకు కొల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం దోమ తెరలు పంపిణీ చేశారు. ప్రస్తుతం వానలు కురుస్తుండటంతో దోమలు విపరీతంగా పెరిగి, దోమకాటు వలన పలువురు ఆదివాసీలు జ్వరాల బారినపడ్డ విషయం కొల్లి ఫౌండేషన్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు కల్పనా చౌదరి 35 ఆదివాసీ గిరిజన కుటుంబాలకు దోమతెరలు అందజేశారు. అదేవిధంగా జ్వరబాధితుల ఇళ్లకు వెళ్లి పరామర్శించారు.

సీఎంపీఎఫ్ నగదు జమ చేయండి..



జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): 2023 మే నుంచి హోల్డ్‌లో పెట్టిన సీఎంపీఎఫ్ నగదును డ్రైవర్ల అకౌంట్‌లో జమ చేయాలని కోరుతూ బుధవారం కొత్తగూడెం జీఎం కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం ఎస్‌ఓటూ జీఎం కోటిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం నాయకులు మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో హత్యాకాండపై నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఇల్లెందు: బంగ్లాదేశ్‌లో హిందువుల మీద జరుగుతున్న అమానుష దాడులు, హత్యాకాండను నిరసిస్తూ హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఇల్లెందు బంద్ విజయవంతమైంది. బుధవారం ఇల్లెందులో హిందూ సంఘాల ఆధ్వర్యంలో పట్టణ బంద్ పాటించారు. కిరాణ షాపులు, దుకాణాలు, పాన్‌షాపులు, సినిమా హాళ్లు, హోటళ్లు, వస్త్రవ్యాపారాలు, రైసు మిల్లులు బంద్ పాటించాయి. కార్యక్రమంలో హిందువు సంఘాల నేతలు కొల్లి సంజీవరెడ్డి, డీకే శ్రీనివాస్, జయప్రకాష్, బాలకిషన్, కీర్తి ప్రసాద్, దోమల మహేశ్వర్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తరలిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న సివిల్ సప్లై డీటీ

టేకులపల్లి: రేషన్ డీలర్లు షాపుల నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం చేయొద్దని సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్‌రావు అన్నారు. ఈ మేరకు అయన బుధవారం టేకులపల్లి తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని రేషన్ డీలర్లతో సమావేశమయ్యారు. మాట్లాడుతూ... మండలంలోని అన్ని రేషన్ కార్డులకు సంబంధించిన ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అంతేకాకుండా అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే డీలర్లు సమయపాలన పాటించాలని సూచించారు.

లోపాలను సరిచేయాలి



కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న వార్డు ప్రజలు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణ పరిధి రామవరం 9వ వార్డులో బుధవారం మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామి ఆకస్మిక తనిఖీ చేశారు. వార్డులో ఇటీవల నిర్మించిన డ్రెయినేజీలలో ఉన్న లోపాలను తక్షణమే సరిచేయాలని డీఈకి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రజలు కమిషనర్‌కు పలు సమస్యలను వివరించారు. స్పందించిన కమిషనర్ సమస్యలన్నింటినీ త్వరలోనే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోరె రమేష్‌కుమార్, స్థానికులు కోలా ఎల్లయ్య, రాజేందర్, శివకృష్ణ, ఈశ్వరయ్య, తాతారావు, సత్తిబాబు, కిషోర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పేరు మార్చే.. ఫలితం సున్నా

- పల్లె దవాఖానాలుగా మారిన ఆరోగ్య ఉపకేంద్రాలు
- వేధిస్తున్న వైద్యుల కొరత
- అత్యవసర వైద్యానికి పెద్దాస్పత్రులే దిక్కు
- మండలంలో 12 పల్లె దవాఖానాలు



యానంబైల్ గ్రామంలోని పల్లె దవాఖానా

పాల్వంచరూరల్: ఆరోగ్య ఉపకేంద్రాలను పల్లె దవాఖానాలుగా పేరు మార్చినా సేవల్లో మార్పు లేదు. పల్లెదవాఖానాలో ఎంబీబీఎస్ వైద్యులు లేక ఆయుర్వేద వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆశాలే శరణ్యమయ్యారు. గ్రామీణ ప్రాంతాల ప్రజల దూర భారాన్ని తగ్గించి ప్రజల వద్దకే వైద్యసేవలు అందించాలనే సంకల్పంతో గత ప్రభుత్వం ఆరోగ్యకేంద్రాల పరిధిలో ఉన్న ఉపకేంద్రాలను పల్లె దవాఖానాలుగా మార్చి గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు నెలకొల్పిన పల్లెదవాఖానాల్లో ప్రజలకు వైద్యసేవలు అందడం లేదు. ప్రాథమిక అరోగ్య కేంద్రాలతో సమానంగా వైద్యసేవలు అందించేందుకు ఒక్కో దవాఖానాకు ప్రత్యేక వైద్యాధికారితోపాటు ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లను నియమించింది. వీరు ఆయా దవాఖానాలలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4గంటల వరకు వైద్యసేవలు అందించాలి. పాల్వంచ మండలంలో మొత్తం 12 పల్లె దవాఖానాలు ఉండగా వాటి పరిధిలో సుమారు 75 హ్యాబిటేషన్లు ఉన్నాయి.

పర్యవేక్షణ లోపం...

పల్లె దవాఖానా నిర్వహణపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేదు. సిబ్బంది కొరత కారణంగా 12గంటల వైద్యసేవలు అందడం లేదు. ఈ దవాఖానాల్లో 12రకాల వైద్యసేవలు అందిస్తారనే విషయం కూడా గ్రామీణ ప్రాంత ప్రజలకు తెలియదు అంటే వైద్యసేవల తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.



అడవిని తలపిస్తున్న రేగులగూడెం పల్లె దవాఖానా

ప్రతిపాదనలు పంపాం..



గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. పీహెచ్‌సీ వైద్యుల ద్వారా నిరంతర పర్యవేక్షణ జరుపుతున్నాం. ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టుల భర్తీ కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం.
– డాక్టర్ ఎల్.భాస్కర్‌నాయక్, జిల్లా వైద్యాధికారి

వైద్యులు ఎప్పుడు వస్తారో తెలియదు..



రేగులగూడెంలోని పల్లెదవాఖానా ఎప్పుడూ మూసే ఉంటుంది. వైద్యులు ఎప్పుడు వస్తారో ఎప్పుడు పోతారో ఇక్కడి గిరిజనులకు తెలియదు. ఇప్పటికైనా వైద్యులు నిత్యం అందుబాటులో ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.
– ప్రభాకర్, రేగులగూడెం

డాక్టర్‌ను నియమించాలి..



సోములగూడెంలోని దవాఖానాకు డాక్టర్‌ను నియమించి ప్రజలకు వైద్యసేవలు అందించాలి. ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. ప్రజలు అత్యవస వైద్యానికి మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. కనీసం వైద్యసిబ్బంది కూడా రెగ్యులర్‌గా రావడం లేదు.– ఎం.ప్రేమ్‌కుమార్, సోములగూడెం

రోడ్డుపై బైఠాయించి ఆందోళన



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కొత్తగూడెంరూరల్: ఇల్లెందు రోడ్డు నిర్మాణం విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారని, ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని లక్ష్మీదేవిపల్లి మండలం శేషగిరినగర్ వాసులు బుధవారం ఆందోళన చేపట్టారు. బైపాస్ రోడ్డు వద్ద గ్రామస్తులు బైఠాయించి భారీ వాహనాలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ... బైపాస్ రోడ్డు మొత్తం కొట్టుకపోయిందని, రోడ్డంతా పెద్ద గుంతలు ఏర్పడ్డాయన్నారు. ఈ విషయం ఆర్ అండ్‌బీ, సింగరేణి అధికారులకు చెప్పినా పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బారీ వాహనాల రాకపోకలు కొనసాగించటంతో దుమ్ములేస్తోందని, ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. అధికారులు స్పందికచపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టండి..

టేకులపల్లి: గ్రామాలల్లో వ్యాపిస్తున్న విషజ్వరాలను అరికట్టాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ టేకులపల్లి మండల కార్యదర్శి కల్తీ వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు బుధవారం న్యూడెమోక్రసీ మండల కమిటీ ఆధ్వర్యంలో సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి విజయకి వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ... మండలంలో వైరల్ జ్వరాలతో వందలాది మంది మంచం పట్టి నడవలేని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్ శాఖల నిర్లక్ష్యం, నిధుల లేమితో తగిన చర్యలు చేపట్టకపోవడమే దీనికి ప్రధాన కారణమని విమర్శించారు. అంతేకాకుండా గ్రామాలలో దోమలు విపరీతంగా పెరిగి అనేక వ్యాధులు వస్తున్నాయని తెలిపారు. దోమల నివారణ జరిగిందని అధికారులు చెప్పిన మాటలు వట్టి మాటలేనని ఈ జ్వరాల లెక్కలే తెలియజేస్తున్నాయన్నారు. ఇకనైనా అన్ని గ్రామాల్లో యుద్ధప్రాతిపదికన పారిశుద్ధ్య పనులు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డి.ప్రసాద్ గుగులోతు రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

25న చలో హైదరాబాద్



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

కొత్తగూడెంటౌన్: ఈనెల 25న హైదరాబాద్‌లో జరగనున్న ఓబీసీ అడ్వకేట్స్ కన్వెన్షన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. మాట్లాడుతూ... ఓబీసీ న్యాయవాదులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

విద్య, వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న రాజేష్

ఇల్లెందు: పీడీఎస్‌యూ ఆవిర్భవించి 50 ఏళ్ల పూర్తి చేసుకోగా ఈ ప్రస్థానంలో నిత్య నిర్బంధం అక్రమ అరెస్టులు జైళ్లు, ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని విజయాలు సాధించిదని నాయకులు తెలిపారు. ఈ తరుణంలో పీడీఎస్‌యూ విద్యా, వైజ్ఞానిక మహాసభలు నిర్వహిస్తున్నట్లు పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఇ.రాజేష్ తెలిపారు. బుధవారం ఇల్లెందులో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ... ఈ నెల 16, 17, 18 తేదీల్లో సిద్దిపేటలో మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు తరలివెళ్లి విజయవంతం చేయాలని కోరారు.

సీఎం పర్యటనను జయప్రదం చేయండి

జూలూరుపాడు: గురువారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనను జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ.. పూసుగూడెంలో సీతారామ ప్రాజెక్ట్ పైలాన్‌ను సీఎం ప్రారంభించి, పంపు హౌస్‌లను ప్రారంభిస్తారన్నారు. అనంతరం వైరాలో నిర్వహించే సభలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీలో భాగంగా చెక్కులు పంపిణీ చేయనున్నారని తెలిపారు. రైతులు, అన్నివర్గాల ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

గ్రామాల్లో వైద్యశిబిరాలు



జూలూరుపాడు: పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



ఇల్లెందురూరల్: ధనియాలపాడులో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీఓ, డాక్టర్ లోహిత

ఇల్లెందురూరల్: మండలంలోని ధనియాలపాడు గ్రామపంచాయతీలో బుధవారం కొమరారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైదశిబిరం నిర్వహించారు. గ్రామంలో జ్వరపీడితులను గుర్తించి పరీక్షలు నిర్వహించారు. వారి నుంచి రక్తనమూనాలు సేకరించి అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం ఎంపీఓ చిరంజీవి, వైద్యాధికారి డాక్టర్ లోహిత గ్రామాలలో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. నీరు నిల్వ ఉన్నచోట ఆయిల్ బాల్స్ చల్లించారు. గుంతల నుంచి నీటిని తొలగించేలా చర్యలు తీసుకున్నారు. మురుగు కాల్వలను శుభ్రం చేయించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

జూలూరుపాడు: కాకర్ల గ్రామంలో బుధవారం జూలూరుపాడు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. డాక్టర్ వెంకటేశ్వర్లు ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మాట్లాడుతూ.. పలువురు జ్వరం, జలుబు, దగ్గు, ఒళ్లునొప్పులతో బాధపడుతున్నట్లు చెప్పారు. ఎస్సీకాలనీలో పర్యటించామని, పారిశుద్ధ్య లోపం కారణంగా కాలనీవాసులు అనారోగ్యం బారినపడుతున్నట్లు గుర్తించామన్నారు. ఇంటింటికీ తిరిగి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురుగు నీటి నిల్వలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కాలనీ వాసులకు అవగాహన కల్పించామన్నారు. ప్రతీఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రత్నకుమార్, హెల్త్ అసిస్టెంట్ కృష్ణ, ఏఎన్‌ఎం అనూష, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో..

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణ పరిధి బూడిదగడ్డ ఏరియాలోని శ్రీ స్నేహలత – సంధ్యాలత వృద్ధాశ్రమంలో బుధవారం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల, చుంచుపల్లి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. 82 మంది వృద్ధులకు పరీక్షలు నిర్వహించా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ ఉషారాణి, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ మహేష్, సిబ్బంది కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు



రోడ్డుపై మట్టి పోస్తున్న దృశ్యం

టేకులపల్లి: ఒడ్డుగూడెం నుంచి బర్లగూడెం వరకు రోడ్డు అధ్వానంగా మారింది. అడుగడుగునా గుంతలతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. వర్షాకాలంలో ఈ సమస్య మరింత అధికంగా ఉంటుంది. ఈ సమస్యపై గత నెల 17న సాక్షి దినపత్రికలో రోడ్డు ఆగమాగం శీర్షికన ప్రత్యేక వార్తా కథనం ప్రచురితమైంది. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పందించారు. సదరు రహదారికి మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో బుధవారం రహదారిపై గుంతలు లేకుండా మొరం పోయించారు. మరమ్మతుల పనులను కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్, పోశాలు, గణేష్, సర్దార్, రవి, చందర్‌సింగ్, మోహన్, కళ్యాణ్ పరిశీలించారు.

రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



పీఏసీఎస్ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందురూరల్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నూరుశాతం అమలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఇల్లెందులోని గోవింద్ సెంటర్‌లో పీఏసీఎస్ కార్యాలయ నూతన భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. మాట్లాడుతూ... రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రానున్న రోజుల్లో రైతుభరోసా పథకాన్ని సమగ్రంగా అమలు చేసేందుకు పటిష్టమైన ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు. ప్రస్తుత సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకొని సఫలీకృతమైందన్నారు. రుణమాఫీ అయిన రైతులకు పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొత్తరుణాలను వెంటనే మంజూరు చేస్తున్నారని చెప్పారు. నూతన భవనాన్ని పీఏసీఎస్ ఆర్థికాభివృద్ధికి వేదికగా మలచుకోవాలని, దీనికోసం కార్యాలయంలోని ఖాళీ గదులను క్రయవిక్రయాలు పెంచుకునేలా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మెట్టెల కృష్ణ, పోలేపల్లి నాగేశ్వరరావు, జనగం కోటేశ్వరరావు, ఆవుల కిరణ్, కిన్నెర నర్సయ్య, డైరెక్టర్లు, సీఈఓ, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు మంజూరు చేయండి..

పాల్వంచరూరల్: పాండురంగాపురం నుంచి బూర్గంపాహడ్ మండలంలోని రాజీవ్‌నగర్ కాలనీకి రహదారి సౌకర్యం లేక గిరిజనులు నిత్యం అవస్థలు ఎదుర్కొంటున్నారు. రోడ్డు మంజూరు చేయాలని సేవాలాల్ రైతుసేన అధ్యక్షుడు భద్రునాయక్, దాసరి రమేష్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటున్న గిరిజనులు వైద్యం కోసం, ఇతర అవసరాల కోసం పాల్వంచ పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. వర్షాకాలంలో రోడ్డు బురదమయంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంటోందని పేర్కొన్నారు. వాహనాలు గ్రామానికి వెళ్లే అవకాశం లేక వైద్యం కోసం గిరిజనులు డోలి మోసుకుంటూ రావాల్సి వస్తోందని, రహదారి సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును ఇటీవల కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

నీటి వాటాపై ప్రకటన చేయాలి



అభివాదం చేస్తున్న కిసాన్ మోర్చా నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): జిల్లాలో నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్ట్ ద్వారా జిల్లాకు రావాల్సిన నీటి వాటాపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయడమే కాక ఎప్పటిలోగా నీరందిస్తారో తెలపాలని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు కాసాని ఐలయ్య, ముత్యాల విశ్వనాథం డిమాండ్ చేశారు. కొత్తగూడెంలోని మంచికంటి భవన్‌లో బుధవారం వారు మాట్లాడుతూ.. ప్రాజెక్టు అంశంపై సీఎంతో మాట్లాడేందుకు రైతు సంఘాల నాయకులకు అనుమతించాలని సూచించారు. రూ.18,600 కోట్లతో నిర్మించే ప్రాజెక్ట్‌కు ఇప్పటి వరకు రూ.8600 కోట్లు వెచ్చించిన దశలో హడావుడిగా ప్రాజెక్ట్‌ను ప్రారంభించాల్సిన అవసరం ఏమి వచ్చిందని ప్రశ్నించారు. జిల్లా నీటి వాటాను పక్కన పెట్టి గోదావరి జలాలను సాగర్‌కు లింక్ కెనాల్‌కు తరలించడం సరికాదన్నారు. ఈ మేరకు గురువారం పర్యటన సీఎం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు జాతోట్ కృష్ణ, నాగేశ్వరరావు, ఊక్లా, అన్నవరపు సత్యనారాయణ, చంద్ర నరేంద్రకుమార్, చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు, సలిగింటి శ్రీనివాస్, పి.సతీష్, రాంచందర్, మల్లికార్జున్‌రావు, పూర్ణ పాల్గొన్నారు.

ఆదివాసీల సమస్యలపై దృష్టి పెట్టండి..

కొత్తగూడెంఅర్బన్: సీఎం రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లా పర్యటనలో ఆదివాసీ సమస్యలపై దృష్టి పెట్టాలని ఆదివాసీ ఐక్య కార్యాచరణ సమితి జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వాసం రామకృష్ణదొర బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఏజెన్సీలో ఆదివాసులకు విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో 100 శాతం రిజర్వేషన్‌పై చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను మైదాన ప్రాంతాలకు తరలిస్తూ జిల్లాలోని ఏజెన్సీ ఐదు నియోజకవర్గాలకు అందకపోవటం శోచనీయమని పేర్కొన్నారు. గోదావరి జలాలు జిల్లాలోని అన్ని ఆదివాసీ గ్రామాల్లో పంటపొలాలకు అందే విధంగా ప్రాజెక్టును రీడిజైన్ చేయాలని కోరారు. ఏజెన్సీలో 100 శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ నియామకాలు ఆదివాసులకే చెందాలని, గిరిజన గురుకులాల్లో తొలగించిన పార్ట్ టైం గిరిజన ఉపాధ్యాయ, ఉద్యోగస్తులను వెంటనే విధుల్లో తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సంఘసేవలో భాగస్వాములు కండి..



నేతాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సంఘం సభ్యులు

పాల్వంచ: సంఘసేవలో ప్రతీఒక్కరు పాలు పంచుకోవాలని ప్రముఖ వైద్యులు సోమరాజు దొర అన్నారు. నేతాజీ యువజన సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం స్థానిక వనమా కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్ చంద్ర బోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సోమరాజు దొర మాట్లాడుతూ... సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక కార్యక్రమాలను కొనియాడారు. రానున్న రోజుల్లో మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టి ఆదర్శవంతంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎస్‌జేకే అహ్మద్, డాక్టర్ నామా బుచ్చయ్య, సయ్యద్ రషీద్, ఎండీ మంజూర్, సాలి భాస్కర్, బండి సుధాకర్, శ్రీపాద సత్యనారాయణ, శనగ రామచందర్‌రావు, సయ్యద్ అక్బర్, నుమాన్, అంజద్, ఏజాజ్, రజాక్, స్టాలిన్, ఆసిఫ్, శ్రీరామ్ పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి

కొత్తగూడెంఅర్బన్: విద్యాహక్కు చట్టం–2009 పటిష్ఠంగా అమలు చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ యర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కొత్తగూడెంలో జరిగిన నియోజకవర్గ సమీక్ష సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యను ఒక వ్యాపారంగా మార్చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలోనే యూనిఫాం, బుక్స్ అమ్ముతున్నా, విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ పాఠశాలల వారు ఇచ్చే మామూళ్లకు అలవాటు పడి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఇది సరైంది కాదన్నారు. మార్పు కోసం అధికారంలోకి వచ్చామని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం 2009 పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ప్రతీ ప్రైవేట్ పాఠశాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు ఉచితంగా 25 శాతం సీట్లను కేటాయించాలనే నిబంధన ఉన్నప్పటికీ ఏ ఒక్క ప్రైవేట్ పాఠశాలలో ఈ చట్టాన్ని అమలు చేయడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యాహక్కు చట్టం అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతీ మండలంలో పర్యటించి విద్యాహక్కు చట్టం కమిటీలు వేసి భవిష్యత్‌లో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గంధం మల్లికార్జునరావు, కాంపాటి నరేష్, మాలోత్ వీరు నాయక్, తడికమల్ల దిలీప్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండాలతో ర్యాలీ



పాల్వంచ: అంబేడ్కర్ సెంటర్‌లో చిన్నారుల ప్రదర్శన



కొత్తగూడెంరూరల్: త్రివేణి పాఠశాలలో..

నేడు స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని రాతి చెరువు బంజర ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం జాతీయ జెండాలు చేతబూని ప్రదర్శన నిర్వహించారు. మహాత్మాగాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, భగత్ సింగ్, ఝాన్సీ లక్ష్మీబాయ్, సుభాష్ చంద్రబోస్, భరతమాత, బీఆర్ అంబేద్కర్, రైతు వేషధారణలతో అలరించారు. అదేవిధంగా లక్ష్మీదేవిపల్లి మండలం త్రివేణి పాఠశాల గంగా క్యాంపస్‌లో ప్రీ ఇండిపెండెన్స్ డే నిర్వహించారు. వివిధ వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. – పాల్వంచ/కొత్తగూడెంరూరల్